సాక్షి విజయనగరం

మంగళవారం । 14 । మే । 2024



20న పైడితల్లి దేవర మహోత్సవం

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం నిర్వహణకు తలయారీలు చాటింపు వేశారు. - 8లో



ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

జిల్లాలో సాధారణ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. - 8లో



నిలిచిపోయిన పాసింజర్ రైలు

ఇంజిన్ ఫెయిల్ అవడంతో పాసింజర్ రైలు గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద రెండు గంటలు నిలిచిపోయింది. - 8లో



విజయనగరం ప్రభుత్వ సంగీత కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటువేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఓటెత్తిన చైతన్యం

- జిల్లాలో నగటున 80.50 శాతం పోలింగ్ నమోదు
- ఓటేయడానికి ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- ఓటేసిన వారిలో అధిక శాతం మహిళలు, వయోజనులే
- చాలాచోట్ల ఈవీఎంల మొరాయింపుతో పోలింగ్ ఆలస్యం
- సాయంత్రం వర్షంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం
- రాత్రి 10 గంటల వరకూ వందకుపైగా కేంద్రాల్లో క్యూ
- చెదురుమదురు ఘటనల మినహా ప్రశాంతంగా పోలింగ్



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడానికి ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరిన వారిలో అత్యధికులు మహిళలు, వయోజనులే కావడం విశేషం. ఓటేయడానికి సోమవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకే తరలివచ్చారు. మధ్యాహ్నం ఎండ ప్రభావానికి కొంత పలుచగా కనిపించినా సాయంత్రం 4 గంటల తర్వాత ఎక్కువ మంది బయటకు వచ్చారు. సాయంత్రం 6 గంటల సమయంలో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ఉరుముల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపేశారు. దీంతో పోలింగ్‌కు అంతరాయం కలిగింది. దీనికి తోడు ఉదయం నుంచి ఏదో ఒక చోట ఈవీఎంలు మొరాయిస్తూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఈవీఎంల పనితీరులో జాప్యం ఏర్పడింది. అయినప్పటికీ ఓటర్లు విసుగులేకుండా చీకటిపడినా క్యూలో ఉన్నారు. దీంతో నిబంధనల ప్రకారం 6 గంటలతో ముగించాల్సి ఉన్నప్పటికీ అప్పటికే కేంద్రాల వద్ద భారీ లైన్లు ఉండటంతో పోలింగ్‌ను అధికారులు కొనసాగించారు. సుమారు వంద కేంద్రాల్లో రాత్రి 10 గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది.

- విజయనగరం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ రాత్రి 9 గంటలకు వరకూ సాగింది. నియోజవర్గ కేంద్రంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, టీడీపీ అభ్యర్థి పి.అదితి, టీడీపీ రెబెల్ అభ్యర్థి మీసాల గీత తదితరులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.
- బొబ్బిలిలో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దిబ్బగుడ్డివలస, గొల్లపల్లి, ఫక్కి, బాడంగి మండలం ముగడ ప్రాంతాల్లో మొరాయించిన ఈవీఎంలను కొద్దిసేపటి తరువాత సాంకేతిక నిపుణులు వచ్చి మరమ్మతులు చేశారు. రాత్రి 8 గంటలతో పోలింగ్ ముగిసింది.
- నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ మండలం పేరాపురం గ్రామంలో పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అరగంట సేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. దీనిపై రూట్ అధికారులు కొత్త ఈవీఎంను తీసుకురావడంతో మళ్లీ పోలింగ్ ప్రారంభమైంది. పతివాడ బర్రిపేట, ఎరుకొండ, పూసపాటిరేగ, చల్లవానితోట గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. జనసేన, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.
- రాజాం పరిధిలో గార్రాజు చీపురుపల్లి పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటసేపు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల వద్ద 90 శాతం మేర ప్రశాంత వాతావరణమే కనిపించింది. రాజాం పట్టణంలో మాత్రం టీడీపీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడి ఓటర్లతో పాటు ఎన్నికల పీవోలను కూడా ప్రభావితం చేసే కార్యక్రమం చేసి, ఒకటి రెండు చోట్ల అలజడి సృష్టించారు.
- చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి మండలంలో కర్లాం, రావివలస, పుర్రేయవలస, మెరకముడిదాం మండలంలోని ఉత్తరవల్లి, గుర్ల మండలంలో చింతలపేట, నడుపూరు, నాగల్లవలస గ్రామాల్లో ఈవీఎంలు ఆలస్యంగా పనిచేశాయి. దీంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. రాత్రి 9 గంటలు వరకు పోలింగ్ కొనసాగుతోంది. మెరకముడిదాం మండలంలోని ఎం.రావివలస పోలింగ్ కేంద్రంలో 300 ఓట్లు పోలయ్యాక మధ్యాహ్నం 2 గంటలు తరువాత ఈవీఎం మొరాయించడంతో అధికార్లు వేరే ఈవీఎంను ఏర్పాటు చేశారు.
- ఎస్.కోట నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొన్నిచోట్ల మాక్‌పోల్‌కు ఏజెంట్లు ఆలస్యంగా రావడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎస్.కోట పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సీతంపేట గ్రామాల్లోనూ, జామి మండలంలో భీమసింగి, లొట్లపల్లి పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మోరాయించాయి. ఎస్.కోటలో సీతంపేట, వెంకటరమణపేట, చింతబడి, శ్రీనివాస్ కాలనీ బూత్‌లలోనూ, వేపాడ మండలంలో సోంపురం, కొండగంగుబూడి, గ్రామాల్లోనూ, జామి మండల కేంద్రాలలో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో సుమారు గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి, ఓటర్లు, పోలింగ్ సిబ్బంది అవస్థలు పడ్డారు. చుక్కవానిపాలెంలో భారీ వర్షానికి పోలింగ్ కేంద్రం వద్ద చెట్లు, స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పోలింగ్ సిబ్బంది అవస్థలు పడ్డారు. నియోజకవర్గ వ్యాప్తంగా 76.66శాతం పోలింగ్ నమోదైంది.
- గజపతినగరగం నియోజకవర్గంలోని దత్తిరాజేరు మండలం గోబ్యాం, పెదమానాపురం, దత్తి, కోమటిపల్లి, పోరలి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో గంటల కొద్దీ ఓటర్లు లైన్‌లో ఉండి ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లను పలుకరించి ఓటింగ్‌కు తరలించారు. కొన్ని గ్రామాల్లో టీడీపీ, జనసేన గ్రామస్థాయి నాయకులు పోలింగ్ కేంద్రాలవద్ద హల్‌చల్ చేశారు.

అలఅలా... అలలా ఎగిసిన ఓటింగ్ (రాత్రి 10 గంటలకు)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
పురుషులు	7,70,805	6,10,456	79.20
మహిళలు	7,92,038	6,31,922	79.78
ట్రాన్స్‌జెండర్లు	78	23	29.49
మొత్తం	15,62,921	12,42,401	80.00

జిల్లాలో పోలింగ్ సరళి ఇలా..

నియోజకవర్గం	ఉ.9 గం॥	ఉ.11 గం॥	మ.1 గం॥	మ.3 గం॥	సా.4 గం॥	సా.6 గం॥	రా.10 గం॥	రా.12 గం॥
రాజాం	9.44	25.08	42.41	56.28	60.02	70.97	74.79	75.83
బొబ్బిలి	9.59	25.28	41.75	27.73	60.78	73.41	78.75	80.65
చీపురుపల్లి	9.16	26.93	43.70	59.37	62.85	76.58	80.55	82.90
గజపతినగరం	7.37	19.57	41.21	56.38	63.47	76.03	82.93	85.16
నెల్లిమర్ల	7.51	19.37	37.47	50.52	57.04	73.26	79.08	84.83
విజయనగరం	8.25	22.38	38.65	44.40	54.24	66.06	70.86	71.49
ఎస్.కోట	10.26	25.79	37.62	57.24	60.64	74.85	80.65	83.70

గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా...

నియోజకవర్గం	2014	2019	2024 (రాత్రి 10 గం॥ వరకు)
రాజాం (ఎస్సీ)	73.82	73.40	75.83
బొబ్బిలి	79.11	79.34	80.65
చీపురుపల్లి	81.11	82.96	82.90
గజపతినగరం	84.19	86.56	85.16
నెల్లిమర్ల	87.69	87.81	84.83
విజయనగరం	71.28	70.86	71.49
ఎస్.కోట	84.22	85.92	83.70



రామభద్రపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల వద్ద ఓటువేసేందుకు బారులు తీరిన మహిళలు



తొలిసారి ఓటు వేసిన సంతోషంలో యువతులు



పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం



పోలింగ్ కేంద్రం వద్ద గుర్తింపు కార్డులను చూపిస్తున్న ఓటర్లు



కొత్తపేట కుమ్మరివీధి ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళలు

న్యూస్‌రీల్

కేఎస్సార్ పురం పీఓపై చర్యలకు డిమాండ్

- రీ ఓటింగ్ జరపాలంటూ ఆర్వోకు ఫిర్యాదు



గజపతినగరం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యకళకు ఫిర్యాదు కాపీని అందజేస్తున్న గ్రామ పెద్దలు, ఏజెంట్లు

గజపతినగరం: గజపతినగరం మండలం కొత్త శ్రీరంగ రాజపురం గ్రామం 100వ పోలింగ్ స్టేషన్‌లో ఓట్ల రిగ్గింగ్‌కు పాల్పడిన పీఓ రాంబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ ఇజ్జిరోతు పైడిపునాయుడు, గ్రామ పెద్దలు గెద్ద సన్యాసప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎమ్.వి.సూర్యకళకు సోమవారం ఫిర్యాదు చేశారు. బొబ్బిలి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు రాంబాబును కొత్త శ్రీరంగరాజపురంలో ఎన్నికల విధులకు వేశారు. ఆయన గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి చేరుకుని టీడీపీ నేతలతో కుమ్మక్కై ఓటింగ్ రిగ్గింగ్‌కు పాల్పడినట్టు గ్రామస్తులు ఆర్వోకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే రీఓటింగ్ జరిపించి, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ



దాసన్న పేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతయుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక సోమవారం స్వీయపర్యవేక్షణ చేశారు. పట్టణంలోని ఎమ్ఎస్ఎన్ కళాశాల, లంకాపట్నం, దాసన్నపేట, బీసీ కాలనీ, వి.టి.అగ్రహారం, నెల్లిమర్ల, గుర్ల మండలం గుజ్జంగివలస, గరివిడి, చీపురుపల్లి, పూసపాటిరేగ మండలం కుమిలి, భోగాపురం మండలం పోలిపల్లి, గుడివాడ, అప్పన్నపాలెం పోలింగ్ కేంద్రాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. భద్రతా సిబ్బందికి, అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. గత మూడు నెలలుగా పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామసందర్శనలు చేసి, ప్రజలతో మమేకమై, ఎలక్షన్ మీటింగులు నిర్వహించి, విభేదాలు లేకుండా చేయడం, సమస్యలు సృష్టించే వ్యక్తులను పార్టీలకతీతంగా గుర్తించి బైండోవర్ చేయడం, బాండులు తీసుకోవడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదుచేయడం ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సత్ఫలితాలినిచ్చాయి. రాజాం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో భద్రతా ఏర్పాట్లను ఏఎస్పీ అస్మా ఫర్హీన్, ఇతర అసెంబ్లీ నియోజక వర్గాల్లో డీఎస్పీలు పర్యవేక్షించారు.

ఓటు వేసిన ఎస్పీ...

స్థానిక ఎమ్ఎస్ఎన్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో సామాన్య ఓటర్లతో పాటూ క్యూలో నిలబడి ఎస్పీ ఎం.దీపిక తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ బద్ధమైన తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

విజయనగరం అర్బన్: జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక కణపాక వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమె స్వయంగా క్యూలో నిల్చొని, తమ వంతువచ్చాక ఓటు వేశారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ కూడా అదే పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి కుటుంబ సమేతంగా ఎం.ఆర్.కళాశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి కంటోన్మెం సెయింట్ మేరీస్ పాఠశాలలో ఓటు హక్కు వినియగించుకున్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి మండలం బాలికల గురుకుల పాఠశాలలో ఓటు వేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జొన్నగుడ్డి పాఠశాలలో ఓటు హక్కును వినియగించుకున్నారు.

ఓటేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎం.ఆర్.కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న మంత్రి బొత్స సత్యనారాయణ



చీపురుపల్లి: గురుకుల పాఠశాల పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



కొత్తవలస: కొత్తవలస హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



బొబ్బిలి: పక్కిలో ఓటు వేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



డెంకాడ మండలం మోపాడ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మొయిదలో ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స



ఓటు వేసేందుకు ఎం.ఆర్.కళాశాలకు వచ్చిన విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ



జొన్నగుడ్డి ప్రాథమిక పాఠశాలలో ఓటు వేసి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, కుటుంబ సభ్యులు



దత్తిరాజేరు: గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కుటుంబ సమేతంగా ఓటు హక్కువినియోగించుకున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



రాజాం: దోలపేట పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటువేసిన వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



తెర్లాం మండలం పెరుమాళిలో వృద్ధురాలిని ఓటు వేయడానికి మూడు చక్రాల బండిపై తీసుకువస్తున్న గ్రీన్ అంబాసిడర్లు



ఓటు వేసేందుకు దివ్యాంగులను ట్రైసైకిల్‌పై తీసుకు వస్తున్న సిబ్బంది

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచింది
- ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అన్ని స్థానాల్లో విజయం
- ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి:

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతోందని, దానికి అనుగుణంగానే ఓటర్లు తీర్పు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. చీపురుపల్లి పట్టణంలోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో సోమవారం తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచిందని, వైఎస్సార్‌సీపీకి ఓటర్లు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాలు, పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో వృద్ధులు, యువత, మహిళలు, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు పలికారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాబోతోందని చెప్పారు. గత ఐదేళ్లపాటు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పథకాలు మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బాటలు వేశాయన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎన్నికల కమిషన్ చక్కగా చేసిందన్నారు. ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోగలిగారని చెప్పారు.

క్లుప్తంగా

ఓటేసిన కొద్ది సేపటికే మృత్యువాత



సత్యం మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య చంద్రమ్మ

డెంకాడ: అంతవరకు బాగానే ఉన్నాడు. భార్యతో కలిసి ఓటు వేసి ఇంటికి వచ్చిన కాసేపటికి ఆ వృద్ధుడు మరణించాడు. ఈ విదారకర సంఘటన మండలంలోని డెంకాడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. డెంకాడ గ్రామానికి చెందిన కోయనేని సత్యం (85) భార్య చంద్రమ్మతో కలిసి పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటు వేసి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అక్కడకు కొద్దిసేపటి తర్వాత కన్ను మూశాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



అసిరయ్య మృతదేహం

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామ సమీపంలో ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుడివాడకు చెందిన దుప్పాడ అసిరయ్య తన పనులు ముగించుకుని గ్రామానికి వస్తుండగా... గ్రామ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి అసిరయ్యను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు కార్తీక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఓటర్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ఇక్బాల్

రామభద్రపురం: మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ఇక్బాల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓలతో మాట్లాడుతూ, పోలింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఓటర్లతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ సులోచనారాణి ఉన్నారు.

కొత్తూరులో ఈదురుగాలుల బీభత్సం

- పోలింగ్ స్టేషన్ల వద్ద ఎగిరిపోయిన టెంట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా

కొత్తూరు : సార్వత్రిక ఎన్నికల వేళ కొత్తూరులో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు నేలకొరిగాయి. పలుచోట్లు చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో పోలింగ్ స్టేషన్ల వద్ద జనరేటర్లను సిద్ధం చేశారు. అవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. రాత్రి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాలు అంధకారం అలముకుంది. విద్యుత్ సరఫర నిలిచిపోవడంతో పోలంగ్ స్టేషన్ వద్ద జనరేటర్లు సక్రమంగ పనిచేయక పోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు, మెట్టూరులతో పాటు పలు గ్రామాల్లో గంటల తరబడి ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొత్తూరుతో పాటు పలు పోలింగ్‌స్టేషన్లను అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

అంధవరంలో దాడి

జలుమూరు: మండలంలోని అంధవరం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవలాపురం రాముపై అదే గ్రామానికి చెందిన పల్లి శంకరరావు, తిరుమలరావులు సోమవారం దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లు పడటంతో ఓర్వలేని టీడీపీ వర్గీయులు రెచ్చకొట్టే మాటలు ఆడుతూ ఓటు వేసి వచ్చిన రామును నేలపై దొర్లించి రాయితో కంటి కింద గాయం చేశారు. స్థానిక వైద్యసిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మధుసూదనరావు సిబ్బందితో వెళ్లి పరిస్థితి సద్దుమణిగించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

20న పైడితల్లి దేవర మహోత్సవం

- 21 నుంచి చదురుగుడిలో పైడితల్లి దర్శనం
- చాటింపు వేసిన ఆలయ తలయారీలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న పైడితల్లి అమ్మవారు



ఆలయ ఆవరణలో చాటింపు ప్రక్రియలో పాల్గొన్న ఆలయ పూజారులు, భక్తులు



కోటవద్ద చాటింపు వేస్తున్న తలయారీలు



చదురుగుడిలో అమ్మవారికి డప్పు వాయిద్యాలతో మనవి చెబుతున్న చినపైడిరాజు బృందం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తలయారులు సోమవారం చాటింపు వేశారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో ఉత్సవ చాటింపు ప్రక్రియను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ మేరకు స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ తలయారులు డప్పు వాయిద్యాలతో అమ్మవారికి మనవి చెప్పారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో దేవర మహోత్సవం చాటింపు వేశారు. అలాగే చిన పైడిరాజు బృందం డప్పులతో ఆలయంలోను, కోట వద్దనున్న కోటశక్తి అమ్మవారికి మనవి చెప్పారు. అనంతరం ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న సోమవారం సాయంత్రం 4 గంటలకు రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అక్కడ నుంచి బాజా,భజంత్రీలు, మేళ తాళాలతో అమ్మవారిని రైల్వేస్టేషన్ నుంచి గాడీఖానా, సీఎంఆర్ జంక్షన్, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకపరమేశ్వరి ఆలయం, న్యూపూర్ణ జంక్షన్ మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటివద్దకు తీసుకువెళ్తారన్నారు. అక్కడ అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత మేళతాళాల నడుమ శివాలయం మీదుగా పెద్దచెరువు పశ్చిమభాగానికి చేరుకుని అక్కడ పెద్దచెరువులో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అక్కడ నుంచి వేకువజామున అమ్మవారిని మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడికి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారన్నారు. మంగళవారం వేకువజామున 6 గంటల నుంచి అమ్మవారు ఆరు నెలల పాటు చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, సూపర్‌వైజర్ ఏడుకొండలు, పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ నాగలక్ష్మి





ఎన్నికల కంట్రోల్ రూమ్ నిర్వహణను మానటరింగ్ చేస్తున్న జిల్లా ఎన్నిక అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో సాధారణ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. అక్కడక్కడా ఈవీఎంల్లో స్వల్ప అవాంతరాలు తలెత్తగా వెంటనే అధికారులు స్పందించి సరిచేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,847 పోలింగ్ కేంద్రాల్లో తొలుత పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఆ తరువాత పుంజుకుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులుతీరారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఉదయం 5.30 గంటలకే చాలా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఎండను దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు వేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పలు చోట్ల అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్న పిల్లల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల్లోకి చేరుకోవడానికి ర్యాంపులు కూడా ఉండడంతో దివ్యాంగులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ కలగలేదు. అంధులకోసం అభ్యర్థుల జాబితాలను బ్రెయిలీ లిపిలో పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. జిల్లాలోని మొత్తం 11 మోడల్ పోలింగ్ కేంద్రాల్లో మరిన్ని అదనపు హంగులు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూం నుంచి పోలింగ్ ప్రక్రియను రోజంతా పర్యవేక్షించారు. ఆమె ఉదయం 4.30 గంటలకే కంట్రోల్ రూమ్‌కి చేరుకున్నారు. అప్పటి నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఆర్ఓల ద్వారా పోలింగ్ బూత్‌ల్లో పరిస్థితి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వచ్చారు. అవసరమైన ఆదేశాలను జారీచేసి పోలింగ్ సిబ్బందిని ముందుకు నడిపించారు. ఉదయం 5.45 గంటలకల్లా మాక్ పోల్ పూర్తి చేసేలా పోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈవీఎంల్లో సమస్యలు తలెత్తిన చోట, వెంటనే సంబంధిత అధికారులను హెచ్చరించి, వాటిని సరిచేసి పోలింగ్ కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై మరింత దృష్టి సారించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ నడిపించారు.

విస్తృతంగా పర్యటించిన ఎన్నికల పరిశీలకులు

ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పోలింగ్ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్లు ద్వారా పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పోలీస్ పరిశీలకులు సచింద్ర పటేల్, జిల్లా వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రంజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ జిల్లాలో పర్యటించి, పోలింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు



ఈవీఎంలు భద్రపరిచే తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



లెండీ ఇంజినీరింగ్ కళాశాల లోపలకు ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఇప్పటికే కేటాయించిన రిసెప్షన్ సెంటర్లకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన 1,874 పోలింగ్ కేంద్రాల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను తరలిస్తున్నారు. డెంకాడ మండలం లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల ఈవీఎంలు, జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరుస్తున్నారు.

అధికారుల అత్యుత్సాహం..

కూటమికి సహకారం



గిరివానిపాలెంలో పోలింగ్ అధికారి తిరుపతిరావు

రణస్థలం: మండలంలోని రెండు చోట్ల బీజేపీ, టీడీపీకి అనుకూలంగా ఎన్నికల అధికారులు అత్యుత్సాహం చూపించారు. ఈ విషయమై బంటుపల్లి, గిరివానిపాలెం బూత్ ఏజెంట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తికి ఫిర్యాదులు చేశారు. గిరివానిపాలెం 142 పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పోలింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు బీజేపీ, టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని, వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసిన సమయంలో వాళ్లకి సహాయంగా వచ్చిన వారిని ఈవీఎంల వద్దకు పంపకుండా నేరుగా వెళ్లి ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. ఇలోగా ఇప్పిలి చిన్న అనే వృద్ధుడు ఓటు తన కుమార్తె సహాయంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. బూత్ ఏజెంట్లు పరిశీలించి ఓటు వేయడానికి ఈవీఎంల దగ్గరకు వెళ్లినప్పుడు పీఓ కూడా వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వృద్ధుడు చెప్పగా పీవో సైకిల్‌పై బటన్ నొక్కడం, ఇది గమనించిన అతని కుమార్తె ఎందుకిలా చేశారని నిలదీశారు. దీంతో గందరగోళం ఏర్పడింది. ఇలా అప్పటికే యాభై పైచిలుకు ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్.రామారావు పోలింగ్ కేంద్రానికి వచ్చి వివాదం సద్దుమణించారు. బూత్ ఏజెంట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్వో కార్యాలయానికి పీవో తిరుపతిరావును సరెండర్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా పీవోపై చర్యలు తీసుకుంటామని ఆర్వో లక్ష్మణమూర్తి తెలిపారు. బంటుపల్లి పోలింగ్ కేంద్రం 185, 186లో ఇజ్జు దుర్గా ప్రసాద్ రెండు సార్లు ఓట్లు వేయడంపై అభ్యంతరం తెలుపుతున్నా పీఆర్వో చిన్నారావు నేరుగా ఓటు వేయించారని బూత్ ఏజెంట్లు ఆర్వోకు ఫిర్యాదు చేశారు.

• పోలీస్ సేవలు భేష్




వృద్ధురాలిని తీసుకువస్తున్న మహిళా పోలీస్



దివ్యాంగుడిని వీల్‌చైర్ ఎక్కిస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సేవలను పలువురు అభినందించారు. జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్, కణపాక, జొన్నగుడ్డి, సుంకరివీధి, ఆబాద్‌వీధి, కొత్త దేవరవీధి, తదితర ప్రాంతాల్లో సోమవారం ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు సేవలందించారు. వీల్‌చైర్ల ద్వారా వృద్ధులను కేంద్రంలోకి తీసుకురావడం, ఓటు వేసిన తర్వాత బయటకు తీసుకెళ్లడం వంటి పనులతో పోలీసులు ప్రజల మన్ననలు అందుకున్నారు. అలాగే సత్య కళాశాల, ఎంఆర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఓటర్లకు సహకరించారు.

టీడీపీ నేతల 'విష' ప్రయోగం



చనిపోయిన రొయ్యిలు

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన చింతు అప్పన్న అనే ఆక్వా రైతుకు చెందిన రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. దీంతో రొయ్యిలన్నీ చనిపోయాయి. బాధితుడు పోలాకి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో ఎన్నికల నుంచి డైవర్ట్ చేసే ప్రయత్నంగా దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్పందించారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు.

గొడవకు దిగిన కూటమి నేతలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి పోలింగ్ బూత్ వద్ద స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం ఎదుట టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు వైస్సార్‌సీపీ నాయకులతో సోమవారం బాహాబాహీకి దిగారు. అంతలో అక్కడకు వచ్చిన పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్ ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితి సద్దుమణిగించారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు

- పోలింగ్ కేంద్రాల వద్ద ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు హడావిడి
- సెల్‌ఫోన్లతో అనుచరుల ఓవరాక్షన్



గుజరాతీపేట పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ కూటమి అభ్యర్థి కె.రామ్మోహన్‌నాయుడు హడావిడి చేశారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లను ప్రలోభపెట్టేలా ఓటు వేయకముందే వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ప్రలోభపెట్టారు. తమ సిబ్బందితో ఫోటోలు దిగిన వారి వాట్సాప్ నంబర్లను తీసుకున్నారు. ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ల అనుమతి లేదని స్వయంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితేనా రామ్మోహన్‌తోపాటు అనుచరులంతా సెల్‌ఫోన్లలో పోలింగ్ కేంద్రాల వద్ద హంగామా సృష్టించడం విమర్శలకు తావిచ్చింది. స్థానిక టీడీపీ నాయకులు కూడా ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లింఘించారు. గుజరాతీపేటలోని వరం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కేంద్రం వద్ద టీడీపీ నేతాలు ఓటర్లకు ప్రలోభపెట్టారు. ప్రధాన గేట్ వద్ద సైకిల్‌కు ఓటు వేయాలంటూ వరం కుమారులు, స్థానిక టీడీపీ నాయకులు చేసిన రచ్చ చేశారు. దీంతో ప్రత్యేక బెటాలియన్‌తోపాటు ఎస్పీ జీఆర్ రాధిక కూడా పోలింగ్ కేంద్రానికి చేరుకుని శాంతిభద్రతలను స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక నాయకులను అక్కడ నుంచి పంపించి వేశారు.

నిలిచిపోయిన పాసింజర్ రైలు



రైలు ఆగిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

- ఇబ్బంది పడిన ప్రయాణికులు

గజపతినగరం: ఇంజిన్ ఫెయిల్ అవడంతో ప్యాసింజర్ రైలు గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద సుమారు రెండు గంటలు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ నుంచి విశాఖపట్నం వస్తున్న పాసింజర్ ఇంజిన్ ఫెయిల్ కావడంతో సోమవారం సాయంత్రం గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద నిలిచిపోయింది. రైల్వే అధికారులు వేరే ఇంజిన్ ఏర్పాటు చేయడంతో రైలు విశాఖపట్నం వెళ్లింది.

సాక్షి క్లాసిఫైడ్స్

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874 [R-451]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185073]

■ సత్యం హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. HYD. ఫోన్: 9966568882, 8019117633 [HA-122]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయు వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7995984445 [HA-130]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.